కేయాస్ కథ

# గూఢాచారి గుండె కాయ

కొడవటిగంటి కుటుంబరావు



మంఛి ఘాఢనిద్దర్లో ఉన్నాను. ఏదో కల – టెలిఫోను నన్నేదో ప్రశ్న లడుగుతున్నది. చెబుతున్నాను.

"గూఢాచారి కేయాస్ నువ్వేనా ?"

"యాస్, యాస్. అయ్, గూఢాచారి మూడుసున్నాలు."

"నీ ప్రాణా లెక్కడున్నాయి ?"

"నా అరిచేతిలో," చెప్పాను దహిర్యంగా.

"శభాష ! మూడుసున్నాలూ ! నేనెవరో తెలుసా ?"

"నువ్వే చెబుతావు."

"అయితే కాస్కో, చెబుతా !"

టెలిఫోన్ ఢాం ఢామ్మని నన్ను కాల్చసాగింది. కాని నాకు ఒక్కగుండు

దెబ్బ తగల్లేదు. నెప్పికూడా లేదు. కాస్సేపు హాశ్చర్యవేసింది. కాని అంతలో గ్యాపక వొచ్చింది. నేను గూఢాచారిని. నన్ను ఎవరూ చంపలేరు. ఆ బొండ్ చూడరాదా ? ఇన్ని పుస్తకాలొచ్చినా ఇంకా బతికున్నాడు.

టెలిఫో నింకా కాలుస్తూనే ఉంది. ఇంతలో నాకు తెలివొచ్చింది. ఎవరో తలుపు తట్టుతున్నారు.

లేచివెళ్ళి తలుపు తీద్దా మనుకుంటుం డగా తలుపుచప్పు డాగిపోయింది_మళ్ళీ నిదరమత్తు.

ఆ మత్తులో ఎవరో నా చేతిలో ఒక కాగితం ముక్క పెట్టారు. దానిమీద పెద్దక్షరాలతో "బయలుదేరుము" అని రాసిఉన్నది.

గూఢాచారిగా నాకు పని తగిలిందన్న మాట. లేచి చొక్కా వేసుకుని బయటి కొచ్చాను. బయట ఒకనీగ నా కోసం చూస్తున్నది.

"ఎవరు నువు ?" అని నే నా నీడను అడగాలేదు, అది నాతో చెప్పాలేదు. నాతోపాటే నీడా కదిలింది. ఇద్దరిమూ రోడ్డంట నడుస్తున్నాం. రోడ్డుపక్క చెట్లన్నీ నిర్మానుషియంగా ఉన్నాయి.

నిద్దర చాలక కళ్లు మూతలు పడు తున్నాయి. నడుస్తూనే ఘాడనిద్దరలో పడిపోయాను.

నాకు మళ్ళీ ఒళ్ళు తెలిసేటప్పటికి కొత్తచోట ఉన్నాను. ఎండ కాస్తున్నది. ఎదురుగా పెద్దరోడ్డు. రోడ్డుమీద కార్లు వాయువేగంతో పోతున్నాయి.

నా పక్కన ఒక డున్నాడు. వాడు నీడ కాదు, మనిషే. చూట్టానికి మన తెలుగువాడల్లేనే ఉన్నాడు.

"ఇదేదేశం ? అమెరికాయా ? రషియాయా ?" అని వాణ్ణి అడిగాను,

"నీకే తెలుస్తుంది " అన్నాడు మనిషి.

కార్లలో పోయేవాళ్ళు తెల్లగా లేరు. మామూలుగానే ఉన్నారు. కాని మా పక్కగా ఇద్దరు మాట్లాడుకుంటూ వెళ్ళారు. వాళ్ళు మాట్లాడేది తెలుగు కాదు. అరవంకూడా కాదు. అరవం నాకు అర్థంకాదు గాని, పోల్చగలను. భద్రం ఉంటే నిముషంలో చెప్పిఉండును. వాడు మంచి అసిస్టంటు.

వాళ్ళు మాట్లాడేది తురకం అయి ఉండొచ్చునని నాకు అరాత్తుగా తట్టింది. తురక మైతే పాకిస్తాను కావచ్చు. అంటే నన్ను అధికార్లు పాకిస్తాను పంపారన్న మాట ! ఎందుకో ?

మనిషిని అడిగితే ? తప్పేమిటి ? బోండుకూడా తెలీని విషయాలు పక్కవాడిని అడిగి తెలుసుకుంటాడు.

"నే నిక్కడి కెందు కొచ్చాను ?" అడిగాను.

మనిషి నవ్వి, "తెలీనట్టడుగుతున్నావే? నీకు కొందరు గూఢచారుల పరిచయం అవసరమని రెండూ మూడూ నాలుగు నుంచి రేడియోలో చెప్పారు. ఈ అను

భవం పూర్తి అయినాక నిన్ను బరిమీద వొదుల్తారు," అన్నాడు మనిషి.

నాకు చాలా ఆనందం వేసింది. డిటెక్టివ్ పనిలోకి అనుభూతి లేకుండా దిగాను. దగ్గిర భద్రం ఉండటం మేలయింది. లేకపోతే నే నా క్లబ్బు డిటెక్టివులముందు తేలిపోయుందును.

శంకరంగా రన్నట్టు గూఢాచారికి డిటెక్టివుకూ ఎక్కడా పోలిక లేదు. గూఢాచారి వొంటరిగాడు. ఒక సెకిట్టరీ ఉంటే ఉంటాడు. పిల్లా పీచూ, అన్నలూ తమ్ములూ, ఎవరూ ఉండరాదు. నేను అన్నివిధాలా అవిడియల్ గూఢాచారినని భద్రం అప్పుడే చెప్పాడు. నాకు కావలిసిందల్లా అనుభూతి. అది ఇవ్వటానికి మనిషిని ఏర్పాటు చేశారు.

"ఆయితే హిప్పుడు మన మేం చెయ్యాలి?" అని మనిషిని అడిగాను.

"ముందు నువు టిఫిను పుచ్చుకో. ఎప్పుడు తిన్న అన్నమో!"

అవును. నా కడుపులో దహించుకుపోతున్నది-ఆకలేనని గ్రహించగలిగాను.

"ఇక్కడ మంచి వుడిపి హోటలేదైనా ఉందా?" అడిగాను.

"గుఢాచార్లు యిడ్లీసాంబారు హోటళ్ళలో దిగకూడదు. మంచి దొరలు దిగే హోటలుకు పోదాం. ఆ కనిపించే గడ్డివామిలో మన రోల్సుకారు దాచా. అదెక్కి హోటలుకు పోదాం," అన్నాడు మనిషి.

ఇద్దరమూ గడ్డివామి చాటుకు



పోయాం. మనిషి గడ్డిలో చెయ్యి పెట్టి రోల్సుకారును బయటికి తీశాడు. నేను రోల్సుకారును చూడటం అదే మొదలు. అందుకని దాన్ని చాలాసేపు చూసి,

"ఇంతకన్న కాస్త సరిసయిన కారులో పోతే యేం? ఇది మరీ రాజు లెక్కకారల్లే వుంది," అన్నాను.

"నే నెప్పుడూ ఈ కారులోనే తిరుగుతాను. ఈ ఊళ్ళో దొరలు దిగే హోటళ్ళన్నీ నావే. అందుచేత నేను ఇంతకు తక్కువ కారులో పోతే బాగుండదు," అన్నాడు మనిషి.

మనిషి కేసి చూశాను. మామూలుగానే ఉన్నాడు. భూలోకసారంగం ప్రొప్పరయిటరుకూడా ఇంతకన్న దరిజాగా తిరుగుతాడు. దొరలుదిగే హోటళ్ళ ప్రొప్పరయిటరంటే మరి—? మారేషంలో ఉండిఉండాలి.

రోల్సు మమ్మ ల్నెక్కించుకుని బయలుదేరింది.

"స్పీడెంతో ఊహించు,'' అన్నాడు మనిషి.

"లే కేం? శానా ఉంటుంది," అన్నాను.

"నూరుకూ నూటపదికీ మధ్య పోతున్నాం. ఈ కారు పెట్రో లెట్టా పీలుస్తుందో తెలుసా? మైలుకు గాలను!"

"అంటే నూరేసి గాలన్ల చొప్పున పీల్చేస్తున్నదా? అబ్బా!" అన్నాను హాశ్చర్యంగా.

"మరి దేంటనుకున్నావు? రోల్సు."

"అయితే మరి రోడ్డుపోలీసులు బుక్కుచెయ్యరూ? ఇంత స్పీడైతే?"

"పోలీసు లందరికీ నా కారు గుర్తే లే!" అన్నాడు మనిషి, బంగారు కట్టడం పళ్ళతో ఇహిలిస్తూ.

రోల్సు పోతున్నది. ఒక మలుపులో ఇద్ద రాడంగులు కారుకింద పడ్డారు. మలుపు తిరగగానే ఒక రెండెడ్ల బండీ మీదిగా కారు పోయింది. కాని మనిషి స్పీడు తగ్గించలేదు సరే కదా బ్రేకయినా వెయ్యలేదు.

"అద్దం పనిచెయ్యటం లేదు. రోల్సు నెవరన్నా వెంబడిస్తున్నారేమో చూడు," అన్నాడు మనిషి.

చూశాను. ఒకబ్బాయి పలకా, పుస్త కాలూ పట్టుకుని కారెనకగా పరిగెత్తు తున్నాడు. ఇద్దరు సైకిళ్ళవాళ్ళుకూడా కారుకు పదిగజాలదూరంలో వస్తున్నారు. సరిగా నేను చూసే సమయానికి ఒక సైకిలువాడు పక్కసందులోకి దూసుకు పోయాడు.

చూసింది మనిషికి చెప్పాను.

మనిషి నవ్వి, "ఎప్పుడూ నా రోల్సు వెనగ్గా కాకుల్లాగే తిరుగుతారు. ఏదో రహస్యం తెలుస్తుందని వాళ్ళ ఆశ!"

రోల్సుమరోముగ్గురిమీదిగా పోయింది. మనిషి గమనించినట్టే కనబళ్ళేదు.

"నిజంగా రహస్యమైన పనిమీద వెళ్ళాలిసొస్తే రిషా ఎక్కిపోతాను. ఆ సంగతి తెలీదు విదేశీ ఏజెంట్లకి!" అన్నాడు మనిషి.

హత్యాశ్చర్యం! నేను చూసినవాళ్ళు విదేశీ ఏజెం ట్లన్నమాట!

"విదేశీ ఎజెంట్లలో వీధి బడిపిల్లలు కూడా ఉన్నారా? వాళ్లు తెల్లవాళ్ళల్లే లేరే!" అన్నాను.

"మారేషం, లమ్ముడూ! మేకప్పు. నలభై యేళ్ళవాడు నాలుగేళ్ళవా డళ్ళే మేకప్పవుతాడు. కన్నతల్లే గుర్తించలే దంటే నమ్ము. నేనే ఉన్నా ననుకో. ఆదేషం వేసుకు నొచ్చానంటే నువు గుర్తియ్యలేవు. ఏరంభో, ఊర్వశో అను కోవాల్సిం దన్నమా టన్నమాటే!" అన్నాడు మనిషి.

"అబ్బా!" అన్నాను.

రోల్సు ఒక దొరలు దిగే హోటలు ముందాగింది. గేటుముందున్న గూరఖా



వాడు మనిషినీ నన్నూ చూడనట్టు నటించాడు.

మనిషి మెట్లమీదికి ఎక్కుతూ, "నేను సూటులో లేనప్పుడు నా నౌకర్లు నన్ను గుర్తించనట్టు నటిస్తారు. కాని ఆపరు. నా వెంట ఉన్నావు గనక సరిపోయింది. లేకపోతే ఆ గూరఖావాడు నిన్ను కత్తికి కండ తీసిఉండును!" అన్నాడు.

మనిషి లుంగీ, బనీనూ ఎందుకు వేసుకున్నాడో నా కర్థ మయింది. మారేషం!

మేడమీద ఒక చిన్నగదిలోకి ఇద్దరమూ వెళ్ళాం. గదితలుపు దానంతటదే తెరుచుకుంది; మళ్ళీ మూసుకుంది. అందులో చాలా సయించుందన్నాడు మనిషి. గదినిండా సయించే.

మనిషి ఒక బల్లదగ్గిర కెళ్ళి కుర్చీలో కూర్చుని, సిరాబుడ్డి మూత తెరిచి, "భోజనము పంపించు," అన్నాడు.

కొంచెం సేపటికల్లా బల్లమీదికి రెండు బుడ్డీలూ, రెండు గ్లాసులూ వచ్చాయి.

మనిషి ఒక బుడ్డీ తీసి, రెండు గ్లాసుల్లోనూ పోసి, "తాగు" అన్నాడు. తను తాగేసి లొట్టవేసి, బంగారప్పళ్ల తో ఇహిలించాడు.

నేను కొంచెం తాగాను. అదేం సోడావోగాని తిమ్మిరి తిమ్మిరిగా ఉంది.

"ఎట్లా వుంది," అన్నాడు మనిషి.

"తిమ్మిరి తిమ్మిరిగాఉంది," అన్నాను.

"అవును. కమ్యూనిస్టులకు తిమ్మిరి జాస్తిగదా! అది వాళ్ళ రక్తంలోనే ఉంటుంది," అన్నాడు.

నా గ్లాసులో మిగిలిందికూడా తాగేశాను. మరింత తిమ్మిరిగా ఉంది.

"చాలా? ఇంకో రెండు బుడ్లు పడదామా?"

"చాలు. ఏదన్నా ఇడ్లీ సాంబారు—" అన్నాను.

"ఛీ, ఛీ! అదంతా అలగా తిండి. మనం—" అంటూ సిరాబుడ్డి మూత తెరిచి, "అసలు భోజనం," అన్నాడు.

మళ్ళీ బల్లమీద ప్లేట్లలో ఆహారం వచ్చింది. ఆకలిమీద ఉండె ఆవురావురని వరసగా మూడు ప్లేట్లూ తినేశాను. మహా రిచిగా ఉన్నది.

"మహా రుచిగాఉన్నది," అన్నాను.

"ఎందుకుండదూ? వేట మాంసం. ఈ వేటగాణ్ణి నీ కివాళ పరిచయం చేస్తాను. ఈ దేశంలో ఉన్న గూఢచార్లలో కొన్ని విధాల ఇంతటివాడు లేడు," అన్నాడుమనిషి, డ్రాయరులోంచి ఫొటో ఒకటి తీసి నాకు అందించాడు.

ఫొటోలో ఉన్నది ఒక దిసెమొల మనిషి బస్టు. అంటే నడుముదాకా బట్టలు లేకుండా కనిపిస్తున్నాడు. ఆ మనిషి మొహం చూస్తే బతికిన కాలేజీలో పెద్దపులి గ్యాపక వొచ్చింది. మనిషి మెడ తలంతలావూ ఉన్నది. రొమ్ములా, చేతులా కండలు కొట్టొచ్చినట్టు మంచి ఫోకసుగా కనిపించాయి.

"గూఢాచారా? నంబ రెంత?" అడిగాను.


"నంబరుతో పనిలేదు. పై దేశాలకు పంపరు. ఈ దేశంలోనే గూఢచారి. ఈ మనిషిని గురించి చెబితే నమ్మవు. ఇతనికి గుండె లేదు. భయపడడు. గుండె లేనివాడికి భయం ఎట్టా వుంటుందీ?" అన్నాడు మనిషి.

"అవును. భయం పుట్టినప్పుడు, గుండెలో గుబులుగా ఉన్నట్టుంటుంది."

"అదే మరి, ఇతనికి గుండేలేదు, గుబులూలేదు. టెలిఫోనులో పిలిచి బయలుదేరమంటే, ఎందుకూ, ఎక్కడికీ అని అడక్కుండా బయలుదేరుతాడు. ఎంత సాహసమైన పని అయినాసరే అన్నంతిన్న అవలీలగా చేస్తాడు. మాట వరసకి చెబుతా. నీచేతికి ఒకకత్తి ఇచ్చి, ఓలక్షమందిని వరసగా నిలబెట్టి అందరి తలలూ నరకమంటే నువ్వెంతమంది తలలు నరకగలవు?" అన్నాడు మనిషి,

"అవును." అన్నాను.

"ఓ వందమందెని నరకగలవేమో!



"హక్కులు - విధులు అంటే ఏవిటిరా ?"
"మమ్మల్ని తన్నడం మీ హక్కు, తన్నులుతినడం మా విధి సార్ !"

మహానరికితే రెండొందలమంది తలలు నరుకుతావు ?"

"వం—!" ఆగాను.

"కాకపోతే రెండొందల తలలు నరికేవు ! నేనే అంటుంటినిగా ? కాని ఈ మనిషున్నాడు చూడూ, లక్షమంది తలలూ నరికేసి, చెయ్యి రెండుసార్లు ఝాడించుకుని ఇంటికి పోయి, హాయిగా భోంచేసి, నిద్రపోతాడు. అటువంటివాడు ప్రపంచంలో ఇంకొకడున్నాడంటే నమ్మ మాకు," అన్నాడు మనిషి.

"అబ్బా !" అన్నాను.

"నువ్వాశ్చర్య పడతావని నాకు తెలుసు. మనిషికి ఇంత మహత్తరశక్తి ఎట్టా వచ్చిందని అడగవేం ?"

"అదే అనుకుంటున్నాను."

"ఈ మనిషి ఒక భయంకరమైన పిచ్చివాడు. పదహారో ఏట మొదలు పెట్టాడు—చంపటం. పౌర్ణమి పౌర్ణమికీ పిచ్చి తంతుంది. అప్పుడు వెళ్ళి ఏప్రాణి నైనా చంపాలి. ఎంత క్రూరంగా చంపితే అతనికంత తృప్తి. మొదట్లో కుక్కల్నీ, మేకల్నీ చంపేవాడు. చాలాఏళ్ళు దొరక లేదు. ఒకసారి మనిషిని చంపాడు. దొరికిపోయాడు. జైల్లో పెట్టారు. తీరా పరీక్షచేస్తే భయంకరమైన పిచ్చి బయట పడింది. వెర్రాసుపత్రిలో పెట్టారు. డాక్టరునూ, వార్డర్లనూ హత్యచేసి, పారి పోయి. తప్పించుకుని ఈ దేశం చేరాడు. గూఢచారిగా కుదిరాడు. చాలా గొప్ప

వ్యక్తి. ప్రభుత్వం రహస్యంగా ఉద్వాసన చెప్పదలచుకున్నవాళ్ళను జైళ్ళలో పెట్టి, ఇతన్ని పిలిపించి అందరినీ సఫా చేస్తుంది. ఒక్కనాడు పన్నెండు వందల మందిని రెండు గంటల అయిదు నిమిషాల్లో చంపాడు. ప్రపంచరికార్డు ఇదేనంటున్నారు. ఈమనిషిని చూడాలని నువు తహతహలాడటం లేదూ?"

ఆడుతున్న దన్నాను.

"ఎందు కాలస్యం? బయలుదేరుదాం."

మనిషి లేచాడు. నేనూ లేచాను. ఈ పౌర్ణమిపిచ్చి గూఢచారిని చూడా లన్న తహ తహతో నాకు కాళ్ళు వణుకుతున్నాయి.

మనిషి గదిమూలలో ఉన్న పెట్టె తెరిచి అందులోకి అడుగుపెట్టి, "రా," అన్నాడు. ఆ పెట్టె దిగువనుంచి మెట్లున్నాయి. నేనుకూడా మెట్లమీదికి వచ్చాక మనిషి పెట్టెమూత మూసి, "పద" అన్నాడు.

"ఇది రహస్యమార్గంలా గున్నదే," అన్నాను.

మనిషి నవ్వి, అరితేరిన గూఢచారివి, నీకు వేరే చెప్పాలా?" అన్నాడు.

నాకు కాస్త గర్వమయింది.

కొంత దూరం దిగేసరికి మెట్లు నీళ్ళ దిగువకు పోతున్నట్టు కనిపించింది.

"దారి లేనట్టుందే? అంటే, నా ఉద్దేశం దారి ఉన్నట్టులేదే అని!" అన్నాను.

"ఇది రహస్య మార్గమని నువు మరిచిపోతున్న సంగతి గ్యాపకం ఉంచుకో! ఈ నీటిలోకి ఎనిమిది అడుగుల లోతుదాకా మెట్లున్నాయి. ఆ నీటి అడుగున మనం రెండు వందల అడుగుల దూరం నడిస్తే మళ్ళీ మెట్లు వస్తాయి. అవి ఎక్కి భూమి మీదికి రావాలి. ఇది ఒకప్పుడు బహిరంగ మార్గం. నీటి అడుగున మనం నడిచే మార్గం ఒకప్పుడు వట్టి కందకం. దాన్ని రహస్య మార్గంగా మార్చటానికని నేను హోటలు మురుగంతా కందకం లోకి పట్టించాను," అంటూ మనిషి తన చేత్తో నా చేతిని పట్టుకుని నీటిలోకి దిగి, మునిగాడు. అతని వెనకగా నేనూ మునిగాను.

నీటిఅడుగున రెండువరసల అడుగులు నడవటం మాటలు కాదు. ఎందుకంటే అది రెండువేల అడుగులల్లే అనిపిస్తుంది. ఆ రెండువే లడుగు లనిపించే దారిన నడిచి, ఎన్నటికీ ఎక్కననుకున్న మెట్లెక్కి మళ్ళీ గాలిలోకి వచ్చేసరికి, పెద్ద రోడ్డూ, రోడ్డుమీద పోతున్న కార్లూ కనిపించాయి.

"అందరూ మనను చూస్తున్నారు. అంటే, నా ఉద్దేశం మనం అందరికీ కనిపిస్తున్నామే అని," అన్నాను.

"కాని మనం హోటల్లోనుంచి వచ్చా

మని ఎవరూ చచ్చినా అనుకోరు. అదే అసలు రహస్యం,'' అన్నాడు మనిషి.

తరవాత మేం నడుచుకుంటూ చాలా దూరం వెళ్ళి ఒక కంచెను సమీపించాం. ఆ కంచె ఉన్న ఇల్లే పౌర్ణమి గూఢచారి దని మనిషి చెప్పాడు.

అతను కంచెలో తల దూర్చి ఒక క్షణం చూసి, "చూడు" అన్నాడు.

కంచెలో తల దూర్చి చూశాను. దూరంగా ఇల్లున్నది. ఇంటికి పక్కగా చెట్లున్నాయి. ఇంటికీ కంచెకూ మధ్య గడ్డితివాసీ, అందులో ఒక పక్కగా సినిమాల్లో చూపించే తామరకొలను, దాని పక్కన ఒక దిసెమొలమొగాడు బోర్లా పడుకునిఉన్నాడు. వాడి వీపు మీదా, రెట్టలకూ, పిక్కలకూ, తొడలకూ కండలు మెలితిరిగిఉన్నాయి.

ఒక ఆడది దిసెమొలతో వాడి వీపు మీద ఎక్కి వీపు పట్టుతున్నది.

"ఆశ్చర్యంకాదూ?" అన్నాడుమనిషి.

"అవును. హత్యాశ్చర్యం. ఆ ఆడ మనిషికి బట్ట లెందుకు లేవూ?"

"బట్టలు వేసుకున్న దనుకో. ఏం లాభం? చెమటకు తడిసిపోతాయి. అందుచేత బట్టలేసుకోదు. విషయం అది కాదు. మొండిమొల ఆడది అట్లా వొళ్ళు పడుతుంటే మరొకడైతే చెలించడూ?" అన్నాడు మనిషి.

"ఎందుకూ?" అన్నాను

"నే చెప్పేది నీ కర్థం కాలేదు. ఈ గూఢచారికి ఆడదానితో అవసరంలేదు," అన్నాడు మనిషి.

"అందులో ఏముందీ? నాకూ అవసరములేదు," అన్నాను. అతని హాశ్చర్యానికి హాశ్చర్యపడుతూ.

"అట్లా మొండిమొల ఆడది నీకు వొళ్లు పడుతుంటే చెలించకుండా ఉంటావూ?" అన్నాడు మనిషి.

"తప్పకుండా," అన్నాను.

మనిషి కళ్ళు పెద్దవిచేసి నాకేసిచూసి, "వొండ్రఫుల్!" అన్నాడు. నాకు హాండు షేకిస్తూ, "నువ్వు నే ననుకున్న దానికన్నా చాలా గొప్ప ఏజెంటు వవుతావు!" అన్నాడు.

నాకు చాలాచాలా గర్వమయింది.

కాని ఆలోచిస్తున్నాను. నేను రెండొందల మందిని తలలు నరకగలనని మనిషి అనుకుంటున్నాడు గాదా –

ఏమో!

ఎందుకు నరక్కూడదూ? వాళ్ళు కదలకుండా నుంచుంటే?

———